## విశాలాంధ్ర కథనానికి కదలిన నగరపాలక సంస్థ

విశాలాంధ్ర-కంటోన్మెంట్ విజయనగరం : విశాలాంధ్ర దినపత్రికలో శనివారం వచ్చిన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. నగరంలోని 50 డివిజన్ వైయస్సార్ నగర్‌లో కాలువలో చెత్త పేరు పోవడంతో మురుగునీరు రోడ్లకు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుందని, ఎవరు పట్టించుకోవడంలేదని విశాలాంధ్రలో వచ్చిన కథనానికి నగరపాలక కమిషనర్ నల్లనయ్య స్పందించారు. వెంటనే పారిశుధ్య సిబ్బందిని ఇంజనీరింగ్ అధికారులను ఆ ప్రాంతానికి పంపించి పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు సాఫీగా సాగేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా మున్సిపాలిటీకి వచ్చి తెలియజేయవచ్చునని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## అభాగ్యులకు ఒక న్యాయం.. అక్రమార్కులకు ఇంకో న్యాయమా..?

- పాకీ వీధిలో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలాన్ని పారిశుద్ధ్య కార్మికులకే ఇవ్వాలి
- భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ పరిధి 30వ వార్డు పరిధి పాకీవీధిలో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలంలో ఆకాలనీకి చెందిన పేద పారిశుద్ధ్య కార్మికులు నివాసం కోసం గుడిసెలు వేసుకుంటే హుటాహుటిన స్థానిక రెవెన్యూ మరియు మునిసిపల్ పోలీస్ యంత్రాంగాల అధికారులు వెళ్లి ఆక్రమించకూడదని పేదలను భయభ్రాంతులను గురిచేసి ఆ స్థలం నుండి వారిని ఖాళీ చేయడం దుర్మార్గమని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్నలు అధికారులు తీరును ఖండించారు. శనివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ లు విలేకరులతో మాట్లాడారు. పాకీ వీధిలో ఉన్నటువంటి పేదలు ప్రభుత్వ స్థలాన్ని నివసించడానికి పాకలు వేసుకున్నారే తప్ప, సినిమా థియేటర్లు, డూప్లెక్స్ ఇళ్ళు నిర్మించుకుని వేరే వ్యక్తులకు అమ్ముకోలేదని, ఈ విషయాన్ని సంబంధిత రెవెన్యూ, పోలీసులు, మున్సిపల్ శాఖలు అధికారులు గమనించాలని కోరారు. పట్టణం ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలు, నకిలీ పొజిషన్ పట్టాలు తయారుచేసిన, చేస్తున్నవారిపై క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు చేయలేదని, ఐదుగురు పేరులతో ఉన్న నకిలీ పొజిషన్ పట్టాలు కలిగి ఉన్న ఐదుగురు వ్యక్తులు వివరాలందిస్తున్న పోలీసులు ఎందుకు విచారణకు పిలవలేదని ప్రశ్నించారు. నకిలీ పొజిషన్ పట్టాలు అని తహశీల్దార్ ఎం శ్రీను, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్ కుమార్‌లు పోలీసులకు నివేదికలు పంపించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, నకిలీ పొజిషన్ పట్టాలు నకిలీ ఇండ్ల స్థలాల ఇండ్ల పట్టాల తయారుచేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పక్క ఆధారాలతో సమర్పించి ఆరు నెలల కాలం గడుస్తున్నప్పటికీ చర్యలు తీసుకోలేని జిల్లా పోలీసు అధికారి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో పలు ప్రభుత్వ చెరువులను, ప్రభుత్వ భూములను భూ కబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, నకిలీ పట్టాలు సృష్టించి వాటిని దర్జాగా అమ్ముకుని అనుభవిస్తుంటే అటువంటి వారి జోలికి పోకుండా, నిత్యం వారి ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు వారి ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ స్థలంలో పాకలు వేసుకుంటే ఈఉన్నతాధికారులు వారిపై జులం ప్రదర్శించడం సిగ్గుచేటన్నారు. నిజంగా ప్రభుత్వ భూములను రక్షించే దమ్ము, ధైర్యం ఈ అధికారులకు ఉంటే ఏదైతే కబ్జాలకు గురయ్యాయో ఎవరైతే ప్రభుత్వ చెరువులు భూములను లక్షలాది రూపాయలకు అమ్ముకొని విలాసవంతమైన జీవితాల్ని అనుభవిస్తున్నారో అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అలాకాకుండా అభాగ్యులైన నిరుపేదలపై జులం ప్రదర్శిస్తే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ చూస్తూ ఊరుకోబోదని పట్టణ పేదలను ఐక్యంచేసి ప్రత్యక్ష భూపోరాటాలకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు వై బొబ్బి పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

**మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి**

విశాలాంధ్ర-బొబ్బిలి:పట్టణ ప్రజలు పరిసరాలు పరిశుభ్రత పాటించాలని స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించవలసిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ పరిధిలో గల అన్ని వార్డులలో ప్రజలకు తడి చెత్త మరియు పొడి చెత్త లను వేరు చేయుట, చెత్తను నేరుగా మున్సిపల్ వాహనానికి అందించుట, ఆన్ సైట్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ పైప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలోగల పలు ప్రాంతాలలో అన్ని సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లో, పురపాలక సంఘ సిబ్బందితో తడి చెత్త, పొడి చెత్త మరియు హానికారక వ్యర్థాలను వేరుచేసి ఏవిధంగా మున్సిపల్ వాహనాలకు అందించాలో తెలియజేశారు. అపార్ట్మెంట్లు మరియు గ్రూప్ హౌస్లలో ఉత్పత్తి అయ్యే చెత్తలను ఆన్ సైట్ కంపోస్టింగ్ పద్ధతి ద్వారా చెత్త నుండి ఎరువులను ఏవిధంగా సృష్టించాలో వివరించారు. పలు అపార్ట్మెంట్లు, గ్రూప్ హౌస్‌లో జరుగుతున్న టెర్రస్ గార్డెనింగ్ పద్ధతి గురించి అడిగి తెలుసుకుని మిగతా ప్రజలు కూడా ఈవిధంగా టెర్రస్ గార్డెనింగ్ చేపట్టాలని తెలియజేశారు. పట్టణ పరిధిలో సేకరిస్తున్నటువంటి తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా ఏవిధంగా మారుస్తున్నది ప్రజలకు వివరించారు, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి క్లాత్, అట్ట, గ్లాసు, పేపరు, కవర్లుగా విభజించి వాటిని అమ్మకం ద్వారా చెత్త నుండి ఏవిధంగా సంపద సృష్టిస్తున్నది వివరంగా తెలియజేశారు. ఈకార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్, మురళి, పర్యావరణ ఇంజనీరు సోమేశ్వరరావు, అన్ని సచివాలయాల వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, మత్మా రిసోర్స్ పర్సన్‌లో, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## సీతం కళాశాలలో ఏఐ ఏజెంట్స్ ఫర్ సేల్స్ కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజుల రేగ పరిధిలోగల సీతం కళాశాలలో శనివారంఏఐ ఏజెంట్స్ ఫర్ సేల్స్, మార్కెటింగ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిదిగా డాక్టర్ కె శిరీషా (అసోసియేట్ ప్రొఫెసర్, విశాఖపట్టణం) విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఏ వన్ సాంకేతికతలో అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలు, మార్కెటింగ్‌లో నైతిక పరిగణనలు రోజు రోజుకి విస్తరిస్తున్నాయన్నారు. ఏఎల్ గవర్నెన్స్ ద్వారా సేల్స్‌ని ఎలా పెంచుకోవచ్చో తెలియజేసారు. ఆధారిత మార్కెటింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, సేల్స్‌ఫోర్స్ ఐన్‌స్టీన్ వంటి వాటిపై మనం ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏఐ-ఆధారిత కస్టమర్ అంతర్దృష్టులు, ప్రచార నిర్వహణపై ఆచరణాత్మక వ్యాయామాలపై విద్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ ఎం శశిభూషణ్‌రావు మాట్లాడుతూ సేల్స్, మార్కెటింగ్ పాత్రలలో ఏ వన్ నైపుణ్యాలకు అధిక డిమాండ్ ఉందన్నారు. అప్లికేషన్లను నేర్చుకోవడం వలన విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్, సేల్స్ అనలిటిక్స్-ఆధారిత కస్టమర్ అనుభవ నిర్వహణలో పాత్రలను సురక్షితంగా ఉంచడంలో సహాయపడుతుందని తెలిపారు. సీతాం కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. వి. రామమూర్తి మాట్లాడుతూ సాధనాలు డేటా-ఆధారిత అంతర్దృష్టులను అందిస్తాయన్నారు. భవిష్యత్ నిర్వాహకులు కస్టమర్ ప్రవర్తన మరియు మార్కెట్ ట్రెండ్‌ల ఆధారంగా మార్కెటింగ్, విక్రయాల నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడతాయని తెలిపారు. ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్.ఓ.డీ డాక్టర్ యస్ వరూధిని మాట్లాడుతూ ఏ ఎల్ ఆధారిత విశ్లేషణలను అర్థం చేసుకోవడం ద్వారా, నిర్వహణ విద్యార్థులు కస్టమర్ ఎంగేజ్‌మెంట్, పోటీ స్థానాలు మరియు ఆదాయ వృద్ధి కోసం మెరుగైన వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ ద్వారా ఎమ్మెల్యేలు వినతుల స్వీకరణ

విశాలాంధ్ర-లక్కవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గం ప్రజా దర్బార్ మండల కేంద్రంలోని నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించినట్లు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆమె ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా ఓ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ ప్రజా దర్బార్ ఐదు మండలాల ప్రజలు భారీ ఎత్తున పాల్గొని వారి వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. నేరుగా సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే వారి సమస్యలు పరిష్కారం చూపునున్నట్లు ఆమె తెలియజేశారు. ఈ ప్రజాదర్బార్లో భారీగా పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు వృద్ధాప్య, వితంతు డప్పు కళాకారులు, తదితర పింఛన్ల కొరకు, కొత్త రేషన్ కార్డులు, గృహ నిర్మాణం స్కీము, ఇళ్ల స్థలాలు, రోడ్లు నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు, సుమారు వందకు పైగా అర్జీల రూపంలో ఎమ్మెల్యే నువ్వు కలిసి అర్జీలు సమర్పించడం జరిగిందని ఆమె తెలిపారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా ఆమె ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. భారీ ఎత్తున సిపిఎం పార్టీ నాయకులు బడ్జెట్ కు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తూ ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు శనివారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లా (ఎమ్మెల్యే గారి క్యాంపు ఆఫీస్)లో "ప్రజా దర్బార్" నిర్వహించారు. నియోజకవర్గం నుండి వివిధ డివిజన్ లు మరియు గ్రామాల నుండి ప్రజలు వచ్చి ఆయా ప్రాంతాలలో నెలకొన్న వివిధ సమస్యలను శాసనసభ్యులు దృష్టికి తీసుకు రావడం జరిగింది. రెవిన్యూ, రహదారులు, మంచి నీరు, విద్యుత్, గృహాలు ఇలా వివిధ రకాల సమస్యలను తెలుసుకొని వారి నుండి వినతులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పట్టణ అధ్యక్షులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపీటీసీ రాజేష్ బాబు, పట్టణ నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, టిడిపి నాయకులు వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.డి.పి.ఎస్. కేసుల్లో నిందితులు ఖచ్చితంగా శిక్షింపబడాలి : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్స్ (ఎన్.డి.పి.ఎస్) చట్టం ప్రకారం నమోదైన కేసుల్లో నిందితులు ఖచ్చితంగా శిక్షింపబడే విధంగా దర్యాప్తు అధికారులు ఆయా కేసుల్లో దర్యాప్తును విజయవంతంగా పూర్తి చేయాలని, అందుకు అనుగుణంగా చట్టంలోని విధి, విధానాలను పాటించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.డి.పి.ఎస్. చట్టం చాలా కఠినమైనదని, చట్టంలో పొందుపర్చిన విధి విధానాలను దర్యాప్తు అధికారులు పాటిస్తే, ఆయా కేసుల్లోని నిందితులు ఖచ్చితంగా శిక్షింపబడే అవకాశం ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణ, వినియోగం, విక్రయాలకు పాల్పడే నిందితులు కఠినంగా శిక్షింపబడితేనే ఈ తరహా నేరాలకు అడ్డుకట్ట వేయగలమన్నారు. ఈ కేసుల్లో దర్యాప్తు అధికారులు ఏ చిన్న తప్పు చేసినా, నిందితులు శిక్షల నుండి తప్పించుకొనే అవకాశం ఉంటుందన్నారు. కేసుల దర్యాప్తు చేయుటలో విధి, విధానాలను, మెళుకవల పట్ల అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం డిఐజి గోపీనాథ్ జెట్టి ఆదేశాలతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని పోలీసు అధికారులకు నిర్వహించా మన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని పోలీసు అధికారులు సద్వినియోగం చేసుకోవాలని, ఎన్.డి.పి.ఎస్. చట్టం పట్ల అవగాహన కల్పించుకొని, కేసుల్లో నిందితులు శిక్షింపబడే విధంగా చూడాలన్నారు. న్యాయస్థానాల్లో ఇప్పటికే వీగి పోయిన కేసుల్లో పోలీసు అధికారులు దర్యాప్తు చేయుటలో చేసిన తప్పిదాలను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, చట్టం పట్ల సంపూర్ణమైన అవగాహనను పెంచుకోవాలన్నారు. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీసు ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ సూపరింటెండెంట్ ఎ.రంగధాం మాట్లాడుతూ కేసు నమోదు, ప్రాపర్టీ సీజర్, ఎఫ్.ఎస్.ఎల్. కు పంపడం, నిందితుల అరెస్టు, అభియోగ పత్రం దాఖలు, న్యాయ స్థానాల్లో సాక్ష్యాలను ప్రవేశపెట్టడం వంటి అంశాల్లో అధికారులు కొన్ని మెళుకవలను పాటించాలన్నారు. దర్యాప్తులో అధికారులు చేస్తున్న చిన్న తప్పిదాలు కారణంగానే నిందితులు శిక్షలు నుండి తప్పించుకుంటున్నరన్నారు. నిందితులు శిక్షింపబడేందుకు కేసును ఫ్రేమ్ చేయుటలో ఖచ్చితంగా విధి, విధానాలను అమలుచేస్తూ, డాక్యుమెంటేషను చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం, వర్కుషాపులో పాల్గొని, చట్టంపట్ల అవగాహన కల్పించిన సెస్టాస్ట్ సూపరింటెండెంట్ ఎ.రంగధాంను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత సాలువతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. ఈ వర్కుషాపులో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఎస్.రాఘవులు, జి.భవ్యరెడ్డి, ఎం.వీరకుమార్, పాడేరు డిఎస్పీ సహబాజ్ అహ్మద్, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## లెండిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-డెంకాద : లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఫిబ్రవరి 15న రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది, సామాజిక సేవ, సమాజ సంక్షేమం పట్ల దాని నిబద్ధతను పునరు ద్ఘాటించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఫలితంగా వైద్య అత్యవసర పరిస్థితుల్లో రక్త అవసరాలను తీర్చడానికి 250 యూనిట్ల రక్తం అందించబడింది. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్, వైజాగ్, రోటరీ పార్వతి దేవి అంచలియా వాలంటరీ బ్లడ్ సెంటర్ విజయనగం, ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్, విజయినగం, రోటరీ బ్లడ్ బ్యాంక్, విశాఖపట్నం మరియు ఏ.ఎస్ రాజా వాలంటరీ బ్లడ్ సెంటర్‌ల సహకారంతో, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. రవితేజ నాయకత్వంలో ఈ శిబిరం నిర్వహించారు. చైర్మన్ మధుసూదన్‌రావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాస్‌రావు, కె.శివరామకృష్ణ, కార్యదర్శి & కరస్పాండెంట్ ఈ కార్యక్రమంలో పాల్గొనగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి ప్రసంగీస్తూ, స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతను, దాని ప్రాణాలను కాపాడే ప్రభావాన్ని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు, సమాజ సేవలో విద్యార్థుల పాత్రను హైలైట్ చేస్తూ, యువత ప్రజారోగ్య కార్యక్రమాలకు చురుకుగా సహకరించాలని కోరారు. ఈ శిబిరం విజయవంతం కావడానికి కీలకమైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అంకితభావంతో సజావుగా నిర్వహించడానికి అవిశ్రాంతంగా కృషి చేశారు తెలిపారు.

## 10వ తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

**సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రామారావు**

విశాలాంధ్ర-వేపాడ : 2024-25 విద్యా సంవత్సరమునకుగాను 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేదిశగా కృషిచేయాలని విజయ నగరం సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రామారావు అన్నారు. మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కునాయుడు పేటలోగల కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకొని శతశాతం ఉత్తీర్ణత దిశగా నడుచుకోవాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి కిరణ్మయి పాఠశాల బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ నిర్వహణ : ఎంపీడీఓ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలంలో గల 29 పంచాయతీల్లో శనివారంనాడు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా మెరక ముడిదాం పంచాయతీలో ఎంపీడీఓ జి భాస్కర్ రావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంపై గ్రామంలో అన్ని పుర వీదుల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సిబ్బంది, పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్ రావు మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త వేరుగా ఇచ్చే విధానంపై ఇంటింటా అవగాహన కల్పించటం జరిగింది.వాతావరణం కాలుష్యం నివారించుటకు గ్రామంలో ప్రతీ ఒక్కరూ వ్యర్థాలు నిర్వహణలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలును కోరారు.గ్రామ ప్రజలు రోడ్లుపై గాని కాలువల్లో గాని చెత్తను వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోనెల కన్నమ్మ, గ్రామీణ నీటి పారుదల సరఫరా శాఖ ఏఈ శివబాబు, ఈఓపీఆర్డీ, అంగన్వాడీ కార్యాకర్తలు, అన్ని శాఖలు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడ్జెట్లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలంటూ వినతి

విశాలాంధ్ర-కొత్తవలస : అంగన్వాడి వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాలకు వేతనాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్లో ఐసిడిఎస్ కు నిధులు పెంచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ మెంబర్స్ అసోసియేషన్ సభ్యులు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం కొత్తవలస తాసిల్దార్ బి.నీలకంఠరావుకు వినతి పత్రం అందజేశారు. 24వ తారీఖు నుండి బడ్జెట్ సమావేశాలు జరుగనున్న సందర్భంగా ఐసిడిఎస్ కు రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించి జీతాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేగల అప్పలరాజు మీడియాతో మాట్లాడుతూ అంగన్వాడి సిబ్బందిని గత ప్రభుత్వం చిన్న చూపు చూసిన కారణంగా 42 రోజుల దీక్షను చేపట్టారని గుర్తు చేశారు. ఆ సమయంలో వచ్చేది మా ప్రభుత్వమే మేము కచ్చితంగా హామీలను నెరవేరుస్తామంటూ టెంట్ల వద్దకు వచ్చి భరోసా ఇచ్చిన నాయకులు నేడు గుర్తించి కేటాయించాలంటూ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఎనిమిది నెలలు కావచ్చినా..నేటికీ అంగనవాడి సిబ్బంది సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఓరి నానా అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ ఎప్పటికైనా బడ్జెట్లో నిధులు కేటాయించి అంగన్వాడీ కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ మెంబర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కే.రమణమ్మ, వియ్యంపేట ఐసిడిఎస్ డివిజన్ అధ్యక్షురాలు కే.వెంకటలక్ష్మి, నాయకులు వై.గంగేశ్వరి, పీ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే మాధవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-భోగాపురం : ఎమ్మెల్యే లోకం మాధవి జన్మదిన వేడుకలను శనివారం జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. భోగాపురంలో జనసేన నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు నివాసం వద్ద జనసేన నాయకుల మధ్య శ్రీనివాసరాజు కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రావాడ గ్రామంలో జనసేన మండల అధ్యక్షుడు వందనాలు రమణ ఆధ్వర్యంలో నాయకులు మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం మాధవి నియోజక వర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని, రానున్న రోజులల్లో నెల్లిమర్ల నియోజకవర్గం లో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.జనసేన అధినేత పవన్ కల్యాణ ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే మాధవి మార్గదర్శనం లో మేమంతా సైనికుల్లా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలి

**ఉమ్మడి జిల్లా గురుకుల కోఆర్డినేటర్ రూపవతి**

విశాలాంధ్ర-బాడంగి... పేద విద్యార్థుల అభ్యున్నత కోసం ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులంతా పదో తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మంచి ప్రతిభ పాటవాలను కనపరచి పాఠశాలలకు పేరు తీసుకురావాలని ఉమ్మడి జిల్లా గురుకుల కోఆర్డినేటర్ కె రూపవతి కోరారు. స్థానిక బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలను శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులంతా చదువుపై ఆసక్తి చూపించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అన్నారు. ఐదో తరగతి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల పరీక్షల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆమె కూడా పాఠశాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పలువుర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెత్తతో సంపదను సృష్టించండి

**ఎంపీడీవో సురేష్**

విశాలాంధ్ర-చీపురుపల్లి : తడి చెత్త పొడి చెత్తతో గృహ సముదాయాలలోనే సంపదను సృష్టించుకోగలరని చీపురుపల్లి ఇన్చార్జ్ ఎంపీడీవో ఐ సురేష్ అన్నారు. శనివారం ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పాత గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డులో గృహాలలో నివసిస్తున్న వారికి తడిచెత్త -పొడి చెత్త పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ద్వారా అందజేస్తున్న ప్రత్యేక బుట్టలలో తడి చెత్త పొడి చెత్తలను నిల్వ చేసుకోవాలని ఆయన సూచించారు. నిల్వ చేసుకున్న చెత్తల ద్వారా సేంద్రీయ ఎరువును తయారుచేసుకుని ఇళ్లల్లోనే కూరగాయలను పెంపుదల చేసుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌తోపాటు, జిల్లా రిసోర్స్ పర్సన్ సుప్రియ ఎస్‌బిఎంఆర్‌సి లక్ష్మణ, శానిటరీ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, రాము, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## ఆటో నుండి జారిపడి మహిళ మృతి

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శనివారం కొరటాం గ్రామం దగ్గర్లో ఆటో నుండి మర్రి పద్మ(39) అనే మహిళ మృతి చెందింది. వివరాలలోకి వెళితే మెరక ముదుదాం మండలం, ఉత్తరావల్లి గ్రామానికి చెందిన మర్రి పద్మ(39), ఆమె భర్త దుర్గారావులకు కుమారుడు శివ హైదరాబాదులో పనిచేస్తున్నాడు. కుమార్తె నాగమణి ఇంటి వద్దనే ఉంటుంది. వీరిద్దరికీ పెళ్లి అవ్వాల్సి ఉంది. అయితే ఈమె శనివారం బలిజిపేట మండలం, గంగాడలో దగ్గర బంధువులు చనిపోవడంతో ఆటోలో కొంతమంది మహిళలతో బయలుదేరి వెళ్ళింది. అయితే కొరటాం దగ్గర్లో ఆటో నుండి జారిపడి అక్కడకక్కడే చనిపోయింది. భర్త దుర్గారావు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై బి. సాగర్ బాబు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి కమ్యూనిటీ హాస్పిటల్ కి పంపించి బంధువులకు బాడీని అప్పగించారని ఆయన తెలిపారు.

## స్వచ్ఛాంధ్రలో భాగంగా పోలీసుల శ్రమదానం

విశాలాంధ్ర-కొత్తవలస : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొత్తవలస పోలీసులు శనివారం శ్రమధానంతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. సిఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో సిబ్బంది పోలీస్ స్టేషన్ ఆవరణలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. పరిసరాలలో నున్న చెత్తను, పిచ్చిమొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థలను ఏరివేసి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేశారు. మూడు రంగుల బిన్లను ఏర్పాటు చేసి...చెత్తను మూడు డస్ట్ బిన్ల లో వేయాలని సిఐ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆకు పచ్చ బిన్ ను తడి చెత్త కోసం, నీలం రంగు బిన్ పొడి చెత్త ను, ఎరుపు రంగు బిన్ లో రసాయనిక వ్యర్థాలను వేయాలని అవగాహన కలిగించారు. ఈ చెత్తను రోజు పారిశుధ్య వాహనాలకు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుదర్శన్, ఏఎస్సైలు సూర్యప్రకాష్, యువరాజు , జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

## వీధి కాలువలు, నీటి కుళాయిలు ఏర్పాటు

విశాలాంధ్ర-గరివిడి : కొండదాడి పంచాయతీ పరిధిలో నీటి సరఫరా పరిస్తితి చాలా అధ్వాన్నంగా మారింది మధ్య వీధి, బార్నాల వీధి, చిన్న వెంకటాపురంలో ఇంటింటి కొలాయులుకి నీటిసరఫరా పూర్తిగా స్తంభించిపోయిన సందర్భంలో ప్రజల ఇబ్బందులు ఎండీఓకి తెలియజేయగా ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్, వారిని పరిశీలనకు పంపి, సమస్య గుర్తించి 7 రోజులులోగా పరిష్కరంచుతామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో వార్డు నుంబర్లు ఎం.రామారావు, యెర్ర అప్పడు భాస్కరరావు, మందాడి లక్ష్మి, సూర్యారావు, గోంప సూరి తదితరులు పాల్గొన్నారు.

## అమృత హస్తం పేదలకు వరం

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** మానవీతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించడం హర్షనీయమని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సుధీర్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లోగిస శ్రీనివాసరావు తన తండ్రిలో గిస రాములు మాజీ ఎంపీటీసీ తృతీయ వర్ధంతి సందర్భంగా ఆసుపత్రిలో గల రోగుల సహాయులకు శనివారం ఉచితంగా అన్నదాన ప్రసాదం అందజేశారు. ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ సుధీర్ చేతులమీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాయక్ మోహన్‌రావు మాస్టర్ సంస్థ నిర్వాహకులు. అన్నదాత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ పరికరాలు ఇవ్వక మృతిచెందుతున్న పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికులు

**సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు ఆవేదన**

**విశాలాంధ్ర-బొబ్బిలి :** మున్సిపాలిటీలో ఈ మధ్యకాలంలో క్యాన్సర్ వ్యాధితో ఎన్. అప్పన్న, జె.లక్ష్మణరావు, ఈరోజు జె. శ్యామల కుమార్ చిన్న వయసులోనే జబ్బులు పడి మరణిస్తున్నారు. పట్టణ ప్రజల కోసం రోజు చెత్త సేకరణ కాలువలు పూడిక రోడ్లు శుభ్రపరచడం లాంటి పనులు చేసే కార్మికులకు మాస్కులు బ్లౌజులు యూనిఫారాలు చెప్పులు రక్షణ పరికరాలు బొబ్బిలి మున్సిపాలిటీ అధికారులు వాళ్లు ఇవ్వడం లేదని, కార్మికులు చేతులతో పని చేయడం వల్ల ఈ జబ్బులు బారిన పడుతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన కుటుంబానికి ఆ పని ఇవ్వడానికి మున్సిపల్ అధికారులు సంవత్సరాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ప్రజల కట్టిన డబ్బులను ఇష్టానుసారంగా రోడ్ల గుమ్ములు కప్పడానికి ఇతర అనేక బిల్లు లో లక్షల రూపాయలు అవినీతికి పాల్పడి జనరల్ ఫండ్ ను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం రక్షణ పరికరాలు ఇవ్వడానికి చేతులు రావడం లేదనిఅన్నారు. మున్సిపల్ యంత్రాంగం తక్షణమే కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులందరికీ రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 35 సంవత్సరాలకే క్యాన్సర్ బారిన పడి చనిపోయిన శ్యామల కుమార్ కు సిఐటియు కార్మిక సంఘం శ్రద్ధాంజలి ఘటించింది. సంఘం తరపున దాన సంస్కరణలకు ఆర్థిక ఆర్థికంగా సహకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జె. రామారావు, బి. యుగంధర్, జి. శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

## భీమాలిలో మామిడి తాండ్ర తయారీ యంత్రాల వినియోగంపై అవగాహన

**విశాలాంధ్ర-లక్కవరపుకోట:** మండలంలోని భీమాలి గ్రామంలో మామిడి తాండ్ర తయారీ చేయవలసిన యంత్రాలు వినియోగం కొరకు తయారీదారులకు అవగాహన నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఏ.వి.ఎస్. జమదాగ్ని తెలిపారు. శనివారం భీమాలి గ్రామంలో మామిడి తాండ్ర తయారీదారులకు యంత్రాల వినియోగం కొరకు ఇచ్చిన శిక్షణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద ఈ కార్యక్రమము నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు ఇందులో 10% వాటా రైతు కట్టుకున్నట్లయితే 90 శాతం బ్యాంకు లోన్ తీసుకోవచ్చునని ఆయన తెలిపారు ఈ పథకానికి ప్రభుత్వము 35% రాయితీ ప్రభుత్వం అందిస్తుందని, అందువలన మామిడి జెల్లీ చేసే ప్రతి రైతు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఏ. పి ఎఫ్. పి. ఎస్ జనరల్ మేనేజర్ సాయి శ్రీనివాస్, జిల్లా రిసోర్స్ పర్సన్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ కచ్చితంగా మామిడి తయారీ తాండ్ర ప్రమాణాలు పాటించినట్లయితే మార్కెటింగ్ రేటు, పెరిగి ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. మామిడి తాండ్ర తయారీకి కావలసిన పరికరాలు గూర్చి రైతులకు వివరంగా తెలియజేశామని ఉద్యానవన శాఖా అధికారి పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్పి, వి ఏ ఏ, రైతులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణ విద్యను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** ఆత్మ రక్షణ విద్యను ప్రతి ఒక్క విద్యార్థి అలవర్చుకోవడం వలన శారీరిక దృఢ త్వాన్ని పెంచుకోగలుగుతారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. శనివారం నాడు వలి రెడ్డి తన నివాసములో కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ బెల్టులు, సర్టిఫికెట్స్‌లు అందజేత చీపురుపల్లి కరాటే విద్యార్థుల రాజాం పట్టణం మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభను కనబరిచారు. చీపురుపల్లి శేఖర్ కరాటే అకాడమీకి సంబంధించిన విద్యార్థులని వలి రెడ్డి ప్రశంసించారు. (నజీర్, భాష, రాహుల్, నితీష్, ప్రశాంత్, సోమనాథ్, ప్రణీత్) పాల్గొని పథకాలు సాధించారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో చీపురుపల్లి పిల్లలు ఎంతో మంచి ప్రదర్శన కనపరిచారు ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌ని రాజాం కరాటే అకాడమీ ఫౌండర్ సీనియర్ మాస్టర్ ఆర్.శివ గారు నిర్వహించారు ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లో మన చీపురుపల్లి విద్యార్థులు సాధించిన పథకాలను మరియు గ్రేడింగ్ బెల్టులు చీపురుపల్లి జడ్పిటిసి ప్రతినిధి మరియు విజయనగరం జిల్లా వైస్సార్ పార్టీ ప్రచారవిభాగం అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, శ్రీకనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద) చేతుల మీదుగా విద్యార్థులకు గ్రేడింగ్ బెల్టు, సర్టిఫికెట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో జుజ్జురువర్మ, ప్రభాత్ కుమార్, శేఖర్ మాస్టర్, వెంకీ, మహంతిమురళి, దబ్బాడ ఆనంద్, పాల్గొన్నారు.

## లింగం రవిబాబు ఇక లేరు

**నేడు స్వర్గధామంలో అంత్య క్రియలు..**

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** హుజూర్ హజరత్ సూఫీ సద్గురువు మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి ప్రియ శిష్యులు, అంతరంగీకులైన ప్రముఖ న్యాయవాది, మానవతావాది, ఎల్బిఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ లింగం రవీంద్రబాబు(రవి బాబు) శుక్రవారం అర్ధరాత్రి కన్ను మూసారు. గత పదిహేను రోజులుగా తీవ్ర అస్వస్థతతో విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవిబాబు శుక్రవారం రాత్రి సుమారు 11.45 ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయాన్ని విజయనగరం పాత బస్టాండ్ సమీపంలోని వారి స్వగృహానికి తీసుకువచ్చారు. బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రుల సందర్శనార్థం ఉంచి ఆదివారం ఉదయం 12 గంటల లోపు రోటరీ స్వర్గధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. రవిబాబుకు భార్య పద్మ, ఇద్దరు కుమారులు(పెద్ద కుమారుడు 2020 లో కాలం చేసారు)చిన్న కుమారుడు కిరణ్, అక్క అన్నపూర్ణ, తమ్ముడు శరత్ బాబు ఉన్నారు. చీమలపాడు అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబాకి రవిబాబు అత్యంత ప్రియ శిష్యుడు. ఆయనతో కలిసి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ప్రయాణం చేసి, బాబా చేసే అన్న సమారాధనలో సేవలందించారు. తండ్రి భోగేశ్వర రావు పేరిట ట్రస్ట్ ను ఏర్పాటు చేసి రవిబాబు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనతో చిన్న నాటి నుంచి చివరి మజిలీ వరకు ప్రాణ స్నేహితులుగా ప్రయాణం చేసిన రవిబాబు లేరన్న బాధ తనను తీవ్రంగా కలచి వేస్తోందని సీనియర్ జర్నలిస్టు ఎలిశెట్టి సురేష్ తమ అవేదన వ్యక్తం చేశారు. బాబా శిష్యులుగా తన ఆధ్యాత్మిక జీవన ప్రయాణాన్ని పరిపూర్ణం చేసిన గొప్ప సేవకుడు రవిబాబు అని అతావుల్లా బాబా కుమారులు ఖాజా బాబు, ఖలీల్ బాబు, జాఫర్ బాబులు అన్నారు. ఆయన బాబా సన్నిధికి చేరారన్న విశ్వాసాన్ని వారు వ్యక్తం చేశారు.

## ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ**

**విశాలాంధ్ర-వేపాడ :** గ్రామాల్లో ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారి పి.లక్ష్మీనారాయణ అన్నారు.మండల కేంద్రం వేపాడలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మండల స్థాయి అధికారులు సచివాలయం సిబ్బంది అంగన్వాడి సిబ్బంది వైద్య సిబ్బంది గ్రామ ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అలాగే గ్రామంలో ప్రజలకు తడి చెత్త ఆకుపచ్చ రంగు గల బుట్టలో పొడి చెత్త నీలం రంగు బుట్టలో విడివిడిగా వేయాలని వివరించారు.చెత్తను వీధిలలో రోడ్లపై వేయకూడదని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి వారి వద్ద నుండి చెత్తను సేకరించి ఆ చెత్తను ఎస్ డబ్ల్యూ పి షెడ్డుకు తరలించి చెత్త నుండి ఎరువు తయారు చేయడం గురించి క్లాప్ మిత్రాలకు,గ్రామస్థాయి సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం, సూర్యనారాయణ,ఉపాధి హామీ పథకం ఏపీఓ ఆదిలక్ష్మి, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్.జి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విజయనగరం డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్.అప్పలనారాయణ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెలియచేసారు. దీనిలో భాగంగా విజయనగరం, ఎస్.కోట డిపోలో ఎక్కువ కాలం ప్రమాద రహిత డ్రైవర్స్ గా ప్రతిభ కనపరిచిన డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమం లో విజయనగరం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం మురళి కృష్ణ ముఖ్య అతిధిగా, రోడ్డు భద్రత కమిటీ సభ్యులు, ఎన్జీవో చైర్మన్ మజ్జి. అప్పారావు , ఎన్ ఇసి రీజియన్ డిప్యూటీ సి. ఎం.ఈ కే.శ్రీనివాసరావు, విజయనగరం, ఎస్. కోట జిల్లా డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు, కార్మిక నాయకులు, కార్మికులు, పాల్గొన్నారు.

## టిడిపిలోకి పలువురు చేరిక

**విశాలాంధ్ర-విజయనగరం రూరల్ :** విజయనగరం మండలం పడాలపేట గ్రామ సర్పంచ్ సువ్వాడ శ్రీదేవి, ఎంపీటీసీ నడిమింటి తులసి ఆధ్వర్యంలో, వైసిపి నాయకులు సువ్వాడ శ్రీను, నడిమింటి సంతోష్‌తో పాటు వార్డు మెంబర్లు పడాల ప్రసాద్, పడాల సూర్యనారాయణ, పడాల శ్రీను, పొట్నూరు సత్యనారాయణ, యడ్ల రాము మరియు సుమారు 200 కుటుంబాలు శనివారం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పట్టణ అధ్యక్షులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపీటీసీ రాజేష్ బాబు, పట్టణ నాయకులు అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, టిడిపి నాయకులు వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-బొబ్బిలి :** పట్టణంలో స్వామివారి వీధిలో వెంకటేశ్వర స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు ఆలయం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరయ్యారు. ముందుగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఏటా ఆలయ వార్షికోత్సవ వేడుకలు జరిపించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ మరిపి తిరుపతి రావు,పలువురు నాయకులు ఉన్నారు.

## రామమందిరం శంకుస్థాపన

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** స్థానిక పూల్ భాగ్, పి.జె.కాలేజీ రోడ్‌లో అయోధ్య బాలక్ రామమందిరంనకు శంకుస్థాపన జరిగింది. అయోధ్య బాలక్ రామమందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ దాత తోట సత్యనారాయణ దంపతులు, ప్రముఖ వ్యాపారవేత్తలు బందారు చంద్రశేఖర్, పువ్వాడ శ్రీహరి దంపతులు మందిరంనకు శంకుస్థాపన చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖవక్త రామకృష్ణనంద చేసిన ఆత్యాధ్మిక ప్రవచనం 'శ్రీమద్రామాయణం- భారతీయతత్వం' అందరినీ ఆకట్టుకుంది. ట్రస్ట్ ఏర్పాటు చేసిన రామసంకీర్తనలు, భజన గీతాలు పలువురినీ అలరించాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కట్టమూరి చంద్రశేఖరరావు,దవళ సర్వేశ్వరావు, జి.సన్యాశినాయుడు, 2వ డివిజన్ కార్పొరేటర్ బందారు ఆనంద్, కుసుమంచి ప్రకాష్, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు



**విశాలాంధ్ర-డెంకాడ :** నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పుట్టినరోజు వేడుకలను శనివారం డెంకాడ గ్రామంలో ఘనంగా నిర్వహించిన డెంకాడ జనసేన నాయకులు ఈ సందర్భంగా జనసేన నాయకులు అందరూ కలిసి శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోత్రనామాలతో పూజా కార్యక్రమం డెంకాడ పంచాయతీ మరియు గునుపూరు పంచాయతీ నాయకులు కలిసి ఎమ్మెల్యే నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆ భగవంతున్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలోనాయకులు జనసైనికులు వీర మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే కోండ్రు

- మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ చట్టప్రకారం జరిగింది
- త్వరలో రాజాంకు స్టేడియం, పీజీ సెంటర్
- బాధితునికి 3,39,520 రూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు

**విశాలాంధ్ర-రాజాం/సంతకవిటి :** సంతకవిటి మండలం, మామిడి పల్లి గ్రామంలో మాజీ తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు తండ్రి ఇటీవల కాలంలో మృతిచెందడంతో వారి సంస్మరణ దినం కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, అనంతరం రాజాం తెదేపా కార్యాలయంలో 'ప్రజా దర్బార్ ' కార్యక్రమం నిర్వహించి నియోజక వర్గం ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతులు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలు, కాలువలు, రోడ్లు తదితర సమస్యలపై 80కి పైగా వినతులు బాధితులు ఎమ్మెల్యేకి అందజేశారు. త్వరలో వీటిని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభ నేని వంశీ అరెస్ట్ పై స్పందించారు. గత ప్రభుత్వంలో అధికారం అండతో వైసీపీ ప్రభుత్వం శాశ్వతం అని భావించి తెలుగు దేశం పార్టీ కార్యాలయంపై తన ప్రోద్బలంతో దాడి చేసినట్లు ప్రజలకు తెలుసన్నారు.తెదేపా అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరి పై తీవ్రమయిన పదజాలంతో దూషించడం రాష్ట్ర ప్రజలు గమనిచారన్నారు. వందల కోట్ల రూపాయలు అవినీతి చేసిన వంశీని పైచట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నారని, సూపర సిక్స్‌లో ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు నెరవేరుస్తారన్నారు. రాజాం నియోజక వర్గంకు సంభందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్టేడియం, పీజీ సెంటర్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టమని త్వరలో ఇవి రానున్నాయన్నారు. ఇప్పటికే మంజూరు అయిన పాలిటెక్నిక్ కళాశాల వచ్చే ఏడాది ప్రారంభం కానుందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు అభివృద్ధిలో దూసుకు పోతూ సీసీ రోడ్లు,కాలువలు చకచకా పూర్తి అవుతూ ప్రజల మన్ననలను ప్రభుత్వం పొందుతుందన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యి వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందిన రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన చెబిలోలు రాజేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. లక్ష 3,39,520 చెక్కును ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**రాజాం :** రాజాం టిడిప కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బారులో రాజాం మున్సిపాలిటీ పరిధి

17వవార్డు ఇంచార్జ్ పెంకి గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, శాసన సభ్యులు కోండ్రు మురళీమోహన్‌కు రోడ్లు డ్రైన్లు వేయించాలని, కరంటు స్థంబాలులైట్లు వేయించాలని వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు టిడిపి నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

## అసలే మలుపు... ఆపై ఆక్రమణ

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** చీపురుపల్లి పట్టణ శివార్లలోని లావేరు రోడ్డులో పుర్రేయవలస జంక్షన్ వద్ద భయంకరమైన మలుపు ప్రాంతం అది. ఇదే ప్రాంతంలో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత కూడా పడిన సంఘటనలు ఉన్నాయి. అటువంటి మలుపు వద్ద ఆర్ అండ్ బి స్థలాన్ని ఎదేచ్ఛగా ఆక్రమించుకుని షాపులు నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు అంటూ పలువురు ఆర్ అండ్ బి అధికారుల పనితీరుని దుయ్యబడుతున్నారు. చీపురుపల్లి లావేరు ప్రధాన రహదారికి ఆనుకొని కనీసం రెండు అడుగుల దూరం కూడా లేకుండా ఈ ప్రాంతంలో తాత్కాలిక పునాదులు ఏర్పాటు చేసుకుని ఒకరి తర్వాత ఒకరు వరుసగా షాపులను నిర్మాణం జరుపుతుండడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పలుమార్లు ద్విచక్ర వాహనదారులు,కారులు, ఆటోలు,ఇదే ప్రాంతంలో ప్రమాదాలకు గురికావడంతో ఆరోడ్డులో ప్రయాణం చేసే పలువురు ఆక్రమణకు గురైన రహదారి కారణంగా ఏక్షణములో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవన ఆధారం కోసం షాపులు ఏర్పాటు చేసుకుంటున్న వారు షాపులను రోడ్డు పక్కనే కనీసం రెండు అడుగుల దూరం కూడా లేకుండా నిర్మాణం చేయడం వలన ఆర్ అండ్ బి స్థలం ఆక్రమణకు గురికావడం గమనాహరం. చీపురుపల్లి నుండి సుభద్రాపురం రణస్థలం ఎక్కువగా ఉపయోగించడంతో నిత్యం భారీ వాహనాలు బస్సులు ఆటోలు రహదారి గుండా రాకపోకలు రద్దుగానే దర్శనం ఇస్తాయి. అంతేకాకుండా ఈ రహదారి గుండా నిత్యం కర్లము ప్రాంతంలో గల వెంకటరమణ పౌల్ట్రీ, పత్తికాయ వలస వద్ద గల ఫుడ్ కార్పొరేషన్ గోడౌన్, పలు రైస్ మిల్లులు, కళ్యాణ మండపాలకు, ఇతర వ్యాపార వాణిజ్య సంస్థలకు భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఇదిలాఉండగా మార్చినెల రెండు, మూడు,నాలుగు, తేదీలలో చీపురుపల్లిలో జరగనున్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఉత్సవాలు కూడా ఇదే ప్రధాన రహదారిలో జరగడం గమనారహం . జాతర జరిగే మూడు రోజులపాటు నిత్యం లక్షలాదిమంది భక్తులతో ఈ రహదారి రద్దీగానే ఉండటం, భక్తులకు ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఇప్పటికే పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపడుతుండడం విశేషం. జాతర సమయంలో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రహదారి ఆక్రమణకు గురి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రహదారిని ఆక్రమించుకొని ఏ ఒక్కరు షాపులను ఏర్పాటు చేయకూడదంటూ ఇప్పటికే డిఎస్పి ఇస్తాయి అధికారులు ఆదేశాలు జారీ చేయడం విశేషం. అయినప్పటికీ య దోచ్చుగా రహదారిని ఆక్రమించి షాపులు నిర్మాణం చేసినప్పటికీ సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం పట్ల పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రాంతంలో ఏవైనా జరగకూడని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో పారిశుధ్యం పట్ల ప్రజల్లో సంపూర్ణ అవగాహన

**విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రజలలో పారిశుధ్యం పట్ల సంపూర్ణ అవగాహన తీసుకొచ్చేందుకు దోహదపడుతుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బాబా మెట్టలోని, దేవి పార్కు వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవి పార్కు ప్రాంతంలో ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ హితాన్ని విశదపరిచే పలు రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆయా స్టాళ్ల ఆవశ్యకతను మహిళలకు కమిషనర్ పల్లి నల్లనయ్య వివరించారు. అలాగే స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను మహిళలచే చేయించారు. ఆ తర్వాత ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లి బాబా మెట్ట ప్రధాన జంక్షన్లో మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ వివరాలతో కూడిన నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పారిశుధ్యనికై అనేక విధాల అవగాహన కార్యక్రమాలను చేపడుతుంద న్నారు. ఇందులో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నాడు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పేరిట సభలు సమావేశాలు నిర్వహించి చైతన్య పరుస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈరోజు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి మహిళల్లో చైతన్యం నింపే విధంగా చెత్త వర్గీకరణ విధానాలను రూపొందించా మన్నారు. తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్తలను వేరుచేసి ప్రతి ఇంటికి వచ్చే చెత్త తరలించే వాహనానికి అందివ్వాలని సూచించారు. దీనివల్ల అధిక పని భారం తప్పడమే కాకుండా చెత్త తరలించేందుకు కూడా సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. ఇళ్లను, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబాలతో వర్ధిల్లుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, ఏఈ పార్వతి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాలువల్లేని చోట ప్రతీ ఇంటి వద్ద ఇంకుడు గుంతలుండాలి

**విశాలాంధ్ర-కొత్తవలస :** మురుగు కాలువలు లేని చోట ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండాలని కొత్తవలస మండలపరిషత్ ఈఓపిఆర్డీ శ్రీదేవి తెలిపారు. "స్వర్ణఆంధ్ర స్వచ్ఛదివాస్" అమలులో భాగంగా వ్యక్తిగత కంపోస్ట్ పిట్స్ మరియు వ్యక్తిగత కిచెన్ గార్డెన్ ల ఏర్పాటుపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. 15 ఫిబ్రవరి 2025 నుండి 20 ఫిబ్రవరి 2025 లోపు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించడం, ప్రజలకు అవగాహన కల్పించడంపై చర్చించారు. గ్రామ సంఘం సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజడ్ ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ప్రతినిధులు, వ్యవసాయం శాఖ ప్రతినిధులు, హార్టికల్చర్ శాఖ ప్రతినిధులు, వీఓఏ, అంగన్వాడి, ఆశా వర్కర్ కలసి అటెండ్ అయ్యి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో ఎపిఎం యు.ఉమా మహేశ్వర రావు, ఎపిఎం (ఎఫ్.పి.ఓ) ఎ.వెంకటరమణ, ఎఓ మాధురి శరణ్య, ఎపిఓ మల్లికార్జున రావు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది శ్రావ్య, ఉషారాణి, దేముడమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్ హైస్కూల్లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం

**విశాలాంధ్ర-రాజాం :** ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ ప్రతిష్టాత్మకంగా 15-02-2025 న తలపెట్టిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు రాజాం గవర్నమెంట్ హై స్కూల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగాయి. ఈ సమావేశానికి విజయనగరం సర్వ శిక్ష అభియాన్ నుండి అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోపీచండ్, సెంట్రల్ మానిటరింగ్ ఆఫీసర్ ఆదినారాయణ, సాల్ట్ అబ్జర్వర్ రమేష్ పర్యవేక్షించారు. ఈ మొత్తం సమావేశాన్న గవర్నమెంట్ హై స్కూల్ రాజాం ప్రధానోపాధ్యాయులు పి.నాగయ్య నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ బీ.వి.అచ్యుత్ కుమార్, బెవర శంకర్రావు సహకారం అందించారు. ఈ సమావేశంలో 19 మంది ఎస్జీటీలు , 36 మంది స్కూల్ అసిస్టెంట్లు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 117 జీవో మార్పులు గురించి, క్లస్టర్ కాంప్లెక్స్ ఏర్పాటు గురించి మరియు వాటి విధివిధానాల గురించి, మోడల్ లెసన్ ప్లాన్ బోధన, క్లిష్ట అంశాల్ని ఎలా బోధించాలి, పదవ తరగతిలో సి డి గ్రేడ్ల విద్యార్థులకు ఎలా బోధించాలి, పదో తరగతికి వందరోజుల యాక్షన్ ప్లాన్ పైన చర్చ జరిగింది.

## సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** సత్య డిగ్రీ & పీజీ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్, ఎన్‌సిసి విభాగాలు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడవ శనివారం క్లీన్ అప్ డ్రైవ్‌లో భాగంగా కళాశాల ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత ఎంత ముఖ్యమో వివరించి, ప్రతి ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్త, వేరుచేసి డస్ట్ బిన్ లలో వేరు వేరు గా వేసే విధంగా విద్యార్థులు తమ గ్రామాలలో పరిసరాలలో వున్న అందరికీ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు అధ్యాపకులు తో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ సి సి కెడేట్స్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ఆవరణ అంతా శుభ్రం చేసారు. పరిశుభ్రత స్థిరత్వం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ శ్రీ బి సూరపు నాయుడు, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చురుగ్గా సిసి రోడ్డు నిర్మాణ పనులు

**రూ.5 లక్షల గ్రామీణ ఉపాధి పథకం నిధులు**

**విశాలాంధ్ర-వేపాడ:** మండలంలోని వావిలపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు గుంటపల్లి దేముడు నాయుడు ఆధ్వర్యంలో రూ.5 లక్షలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామంలోని మెరకపోలం రహదారికి వెళ్లే రహదారికి ఆనుకొని వేసిన సీసీ రోడ్డు నుండి సబ్బవరపు అప్పలనాయుడు కల్లం వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. గ్రామస్తులు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహణ

**విజయనగరం టౌన్ :** గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) యూనిట్ (90214208) తన రెగ్యులర్ మూడవ-శనివారం క్లీన్-అప్ డ్రైవ్‌లో భాగంగా తన క్యాంపస్‌లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, వాలంటీర్ల కళాశాల ప్రాంగణం అంతా శుభ్రపరిచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్ పరిశుభ్రత, స్థిరత్వం ప్రాముఖ్యతను నొక్కిచెప్పడంతో కార్యక్రమం ప్రారంభమైంది. 100 మంది వాలంటీర్లు కళాశాల ప్రాంగణం మరియు సమీప ప్రాంతాలను శుభ్రం చేయడంలో చురుకుగా నిమగ్నమై, వ్యర్థాల నిర్వహణ, బాధ్యతాయుతమైన పారవేసే విధానాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీతమ్ డైరెక్టర్ డా.ఎం.శశి భూషణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అంకితభావాన్ని ప్రశంసిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడంలో తమ కృషిని కొనసాగించాలని కోరారు. పరిశుభ్రతను కాపాడుతామని, సమాజ భాగస్వామ్యాన్ని ప్రేరేపించడానికి ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం ముగిసింది.
16

**వేపాడ :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు

మేరకు ప్రతి నెల 3వ శనివారం అన్ని గురుకుల పాఠశాలలో విధిగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంనీ నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని, నెలకోక అంశాన్ని ఎంచుకుని స్వచ్ఛత కార్యక్రమంలు చేపట్టాలని, స్వచ్ఛత ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించి,అందరినీ భాగస్వామ్యలని చెయ్యాలని జిల్లా కో-ఆర్డినేటర్ ఏస్. రూపవతి ఆదేశాలు మేరకు మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కునాయుడుపేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 15వ తేదీన మూలం - వనరులు అనే అంశాన్ని ఎంచుకొని స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టాలని, స్వచ్ఛత ప్రాధాన్యతపై పాఠశాల విద్యార్థులలో అవగాహన కల్పించాలి అనే కార్యక్రమంతో వేపాడ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఉదయం 9 గం నుండి 11 గం లోపు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలి నిర్వహించారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కి నాంది పలకడం జరిగిందని ప్రిన్సిపల్ యు ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు హాజరయ్యారు.

**పూసపాటిరేగ :** స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో శనివారం జరిగింది. నెలలో మూడవ శనివారము పూసపాటిరేగ గ్రామంలో చేపట్టారు. గ్రామంలోని రాజుల వీదిలో పొడి చెత్త, తడి చెత్త డోర్ టు డోర్ కలెక్షన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పి.హెచ్సిలోని పరిసర ప్రాంతాలు అన్నీ కూడా శుభ్రం చేయించి. తడి చెత్త పొడి చెత్తలు వేరు చేయి.స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్ద సోర్స్ శాగ్రిగేషన్ చేయించి తడి చెత్త.పొడి చెత్త వేరు చేసి క్లాప్ మిత్రాలకు అందజేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించడం అయినది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి విస్తరణ అధికారి, పి.హెచ్సి వైద్యులు పి.హెచ్సి సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

**రాజాం :** స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో

భాగంగా ఈరోజు తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేయుట మరియు వాటి నిర్వహణ కొరకు ప్రజలకు అవగాహన కార్యక్రమం చేయడం జరిగినది. సదరు కార్యక్రమం పోలీస్ స్టేషన్ వీధిలో ఉన్న ఎలిమెంటరీ స్కూలు లో స్కూలు యాజమాన్యం వారితో కలిసి విద్యార్థిని, విద్యార్థులకు తడి చెత్త, పొడి చెత్త మరియు హానికరమైన చెత్తలపై అవగాహన కార్యక్రమం చేయడం జరిగినది. మరియు తెలగా వీధి వెంకటేశ్వర స్వామి కోవెల వద్ద డ్వాక్రా సంఘ సభ్యులతో మరియు మెప్మా అధికారిని రత్నం, సానిటరీ ఇన్స్పెక్టర్ చేగొండి ప్రసాద్ వారి ఆధ్వర్యంలో ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త హానికరమైన చెత్తలపై అవగాహన కార్యక్రమాలు చేయడం జరిగినది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు వారికి తడి చెత్త,పొడి చెత్త హానికరమైన చెత్తలను విడదీసి అందించవలెనని ఈ సందర్భంగా సానిటరీ ఇన్స్పెక్టర్ చేగుండి ప్రసాద్ ప్రజలను కోరారు. అనంతరం తన కార్యాలయాన్ని శుభ్రం పరిచినారు. సదర కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్లు మరడాన అప్పలనాయుడు, నెమలపూరి జయరాజు, సానిటరీ సెక్రటరీలు, మెప్మా అధికారిని రత్నం, సి ఓ లు, ఆర్పి లు, స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**గరివిడి :** స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు జేఎన్‌టీయూ జేవీ సూచనలు మేరకు కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కాలేజీ ఆవరణంలో "స్వచ్ఛ ఆంధ్ర"కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చీపుళ్లు పట్టి చెత్త ఊడవడంతో మొదలుపెట్టారు. అనంతరం అందరూ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వి.జాషువా జయప్రసాద్ గారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని, జీవితకాలం పెరుగుతుందని తెలిపారు. కావున మనం ఉండే ప్రాంతాన్ని,పరిసరాలను పరిశుభ్రత చేసుకునే క్రమంలో సేకరించే వ్యర్థాలను నిర్దేశించిన పద్ధతిలో పారవేయడం అనే నైతిక బాధ్యత మనపై ఎంతైనా ఉందని తెలియజేశారు. అయితే ఈ వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన వ్యర్థాలుగా విభజించి తడి చెత్తను గ్రీన్ చెత్తబుట్టలోను,పొడి చెత్తను బ్లూ చెత్తబుట్ట లోను పారవేయాలని తెలుపుతూ అలాగే పొడి చెత్త ద్వారా ఎలక్ట్రికల్ ఎనర్జీ పొందడం,తడి చెత్త ద్వారా బయోగ్యాస్ పొందడం, ఎరువులుగా ఉపయోగించడం వంటి అదనపు ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ప్రమాదకరమైన వ్యర్థ పదార్థాలును సరైన పద్ధతిలో పారవేయడం ద్వారా విషపూరితమైన వాయువుల ఉద్గారానను, భూగర్భ జలాల్లో కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. కావున ప్రతి పౌరుడు క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములై ఆరోగ్యవంతమైన సమాజ ఆవిష్కరణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్ కుమార్, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు ఉపాధ్యాయులు భాగస్వాములయ్యారు.

**విజయనగరం టౌన్ :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శనివారం

జెఎన్టియు జీవి ఇంజనీరింగ్ కళాశాలలో మూడో శనివారం స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా "మూడు రకాల చెత్తలు వేరుచేసి బయటకు పంపిచ్చుట" అనే కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఇంజనీరింగ్ కాలేజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సహకారంతో కాలేజీ విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జెఎన్టియు జీవి వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మనము కాలేజీని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకు మూడు రకాలైన చెత్త బుట్టలను వాడాలన్నారు. ఆకుపచ్చ రంగు తడి చెత్తకు వాడాలని నీలం పొడి చెత్తకు వాడాలని ఎరుపు హానికరమైనటువంటి చెత్తకు వాడాలని సూచించారు. ఇందువలన చెత్త అంతా కలిసిపోయి ఇబ్బందులు కలగకుండా ఏ చెత్తను ఆ చెత్తగా విడివిడిగా సౌకర్యవంతంగా బయటికి పంపించడానికి వీలవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి జె నాగరాజు, వివిధ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్ డాక్టర్ కె శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ పి శ్రీదేవి, డాక్టర్ వి ఎస్ వకుల, డాక్టర్ ఏ పద్మజా, డాక్టర్ జి అప్పలనాయుడు, డాక్టర్ ఎం హేమ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం అర్బన్ :** చిన్నతనం నుండే పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఉద్బోధించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్పా హైస్కూల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ నల్లనయ్య ప్రతి తరగతి గదికి చెత్త బుట్టలను అందజేశారు. అలాగే పారిశుద్ధ్యం పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించే పోస్టర్లను కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, ఇతర ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే విద్యార్థులచే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెత్తలను వర్గీకరించే

విధానాన్ని తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత కూడా విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవాలని ఉద్బోధించారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం పరిఢవిల్లుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శంకర్రావు, పలువురు ఉపాధ్యాయులు, పారిశుధ్య పర్యవేక్షకుడు షాలేం రాజు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట :** పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

శృంగవరపుకోటలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈరోజు కళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర ,అనే కార్యక్రమం నిర్వహించారు ముందుగా కళాశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి గ్రౌండ్లో ఉన్న చెత్తా ను తొలగంచి, కళాశాలను పరిశుభ్రంగా ఉంచడం జరిగింది.. విద్యార్థుల చేత స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ చల్లా శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు పాల్గొని వారు మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాలను పరిశుభ్రం చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే వాసుదేవరావు , ఎన్సిసి ఆఫీసర్ డాక్టర్ జి ఈరన్న, లక్ష్మణ్, హైమావతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**విజయనగరం :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో 3వ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. కల్లెక్టరేట్ లో నున్న అన్ని శాఖల

అధికారులు, సిబ్బంది వారి కార్యాలయాల పరిసరాలలో నున్న చెత్తను, ప్లాస్టిక్‌ను ఏరివేసి పోగులుగా వేయగా మున్సిపల్ వాహనంలో వాటిని తొలగించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కలెక్టరేట్ ఆవరణలో అధికారులు సిబ్బందితో స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ లోపల పర్యటించి అన్ని శాఖల పరిసరాలను తనిఖీ చేసారు. బయట లోపల ఉన్న చెత్తలను పరిశుభ్రం చేసి ప్లాస్టిక్, వ్యర్థాలను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. సాయంత్రం లోపల కలెక్టరేట్ మొత్తం పరి శుభ్రం చేయాలనీ ఆదేశాలు జారీ చేసారు. ప్రతి కార్యాలయంలో మూడు రంగుల బిన్లను ఏర్పాటు చేయాలనీ జే సి సూచించారు. ఈ వారం చెత్తను మూడు డస్ట్ బిన్లలో వేయాలనే ఉద్దేశ్యంగా నిర్ణయించగా ఆకు పచ్చ బిన్‌ను తడి చెత్త కోసం, నీలం రంగు బిన్ పొడి చెత్త ను, ఎరుపు రంగు బిన్ లో రసాయనిక వ్యర్థాలను వేయాలని అవగాహన కలిగించారు. ఈ చెత్తను రోజు పారిశుధ్య వాహనాలకు అందించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, సి.పి.ఓ బాలాజీ, కలెక్టరేట్ ఏ.ఓ దేవ్ ప్రసాద్, దివ్యాంగుల శాఖ, కలెక్టరేట్ లో నున్న అన్ని శాఖల నుండి అన్ని సెక్షన్ల నుండి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**విజయనగరం రూరల్ :** సెంచూరియన్ విశ్వవిద్యాలయానికి చెందిన హెల్త్ కేర్ ఆన్ వీల్స్ ద్వారా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం పట్టణంలోని గురజాడ పబ్లిక్ స్కూల్ లో విద్యార్థులకు నేత్ర పరీక్షలు, హీమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపు వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురజాడ స్కూల్ డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, కరెస్పొండెంట్ స్వరూపా, హెచ్ఎం పి.శేఖర్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం బి.లత పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్ :** పట్టణంలో దాసన్నపేట వద్ద ఉన్న

విద్యుత్ భవన్లో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా ఎస్ ఈ ఎం లక్ష్మణరావు ఉద్యోగస్తులతో ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి నెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపడతామని తెలియజేసారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు ఈ కార్యక్రమంలో డిజియం కె. వి. లక్ష్మీనారాయణ, ఎస్ఏఓ వి.రాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి.త్రినాథ్, కె.వి. సత్యన్నారాయణ, విద్యుత్ భవన్ ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

**విజయనగరం టౌన్ :** స్థానిక గాజులరేగా పరిధిలోగల

నారాయణ పబ్లిక్ స్కూల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కరస్పాండెంట్ మోయిద నారాయణరావు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ వివరాలను తెలిపారు. పాఠశాల ఆవరణ అంతా శుభ్రపరిచారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను కలిసిన సాయిబాబునాయుడు

**విశాలాంధ్ర-రాజాం :** తూర్పు కాపు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మక్కా సాయిబాబు నాయుడు, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ని శనివారం కలిసారు. జిల్లాలో తూర్పు కాపులు అధిక సంఖ్యలో ఉన్నా నేటికీ సరైన గుర్తింపుకు నోచుకోలేదని తెలిపారు. ఇప్పటికీ సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నామన్నారు. కాబట్టి అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని కోరారు.

## ఆర్మీ, నేవీ ఉద్యోగుల తల్లిదండ్రులకు ఘనంగా సన్మానం

**విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ :** మనకోసం




బోర్డర్లో ఆర్మీ, నేవిలో ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరికి మనం ఎంతో రుణపడి ఉన్నామని ప్రగతి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆర్మీ, నేవీలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగస్తుల ఇంటి దగ్గర ఉన్న తల్లిదండ్రులను ప్రగతిబి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొంతమందిని అభినందించారు. అనంతరం వారిని సాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భోగిరాజు, జాలివాకర్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పరిశుభ్రతకు ప్రజలంతా సహాయ సహకారాలందించాలి : ఎంపీడీవో

**విశాలాంధ్ర-బాడంగి :** మండల ప్రజలంతా గ్రామాల పరిశుభ్రత కోసం పూర్తి సాయి సహకారాలను అందించాలని ఎంపీడీవో ఎస్ రామకృష్ణ అన్నారు. నెలలో 3వ శనివారం నిర్వహించేటటువంటి స్వచ్ఛ ఆంధ్ర... స్వచ్ఛ దివస్... అనే కార్యక్రమంలో భాగంగా శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పేరుకుపోయిన చెత్తను తొలగించడం కార్యక్రమాలను సక్రమంగా జరిగే విధంగా సచివాలయ సిబ్బంది పర్యవేసించాలని కోరారు. సేకరించిన చెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియను చేపట్టాలని అన్నారు. గ్రామానికి కమ్యూనిటీని నిర్మాణంలోనికి తీసుకురావడం, ప్రతి విభాగం నుండి ప్రతి ఉద్యోగి దీనిపై గ్రామీణ ప్రాంతపు ప్రజలకు అవగాహన కల్పించి పరిశుభ్రతపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసే విధంగా పనిచేయాలని సూచించారు. ఇంటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రతి ఆఫీసు పరిశుభ్రంగా ఉండే విధంగా , ప్రతి ఉద్యోగి కూడా తమ తమ ఆఫీస్ ను శుభ్రపరిచే కార్యక్రమానికి కూడా శనివారం చేపట్టారు.. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ కూడా పాల్గొన్నారు అలాగే గ్రామస్థాయిలో కోటిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నటువంటి ఎస్డబ్ల్యుపిసి షెడ్ ద్వారా తయారు చేస్తున్నటువంటి సేంద్రియ ఎరువులను పరిశీలించారు. ఎరువులు ఉత్పత్తి చేసి ఆన్లైన్లో దీన్ని ఇతరులకి విక్రయించే విధంగా ఏర్పాటు చేయాలని మన దగ్గర తయారుచేస్తున్నటువంటి అధునాతరమైనటువంటి పూర్తి బలవర్ధకమైన టువంటి ఎరువులు రైతులకి విక్రయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.ప్రతి రైతు ఈ ఇరువుని తమ పంట పొలాలకు ఉపయోగిస్తే రానున్న తరాలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల క్లీన్ అండ్ గ్రీన్

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు చీపురుపల్లి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై ఎల్ దామోదర్ రావు నేతృత్వంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పాడుబడిన భవనాల సమూహంలో పేరుకుపోయిన చెత్త నిల్వలను పోలీస్ సిబ్బంది తొలగించారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను సమగ్ర శిక్ష ఏపీసీ సందర్శన

**విశాలాంధ్ర-కొత్తవలస :** కొత్తవలస మండలంలో గల కేజీబీవీ పాఠశాలను ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి( అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్) డాక్టర్ రామారావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ప్రతి క్లాస్ రూమ్ లోని విద్యార్థులతో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. 10, ఇంటర్ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు కార్డు కలిగిన ప్రతి రైతుకు రుణం ఇవ్వడమే లక్ష్యం

- రుణాలపై నాలుగు రోజుల ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహణ
- ప్రత్యేక క్యాంపెయిన్ లో 126 మంది రైతులకు రుణాలు మంజూరు
- ఈ ఏడాది 1379 మంది కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు
- కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడి

**విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ :** జిల్లాలో కౌలు కార్డు కలిగిన ప్రతి కౌలు రైతుకు రుణాలు మంజూరు చేయించే లక్ష్యంతో ఫిబ్రవరి 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించామని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్ ద్వారా 462 మంది కౌలు రైతులను రుణాల మంజూరుకు బ్యాంకుల వద్దకు తీసుకువెళ్లి 126 మంది రైతులకు రూ.50.92 లక్షల రుణాలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 1379 మంది కౌలు రైతులకు పంటరుణాలుగా రూ.701.47 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కౌలు రైతులకు రుణాల మంజూరుకు సంబంధించి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి దృష్టికి తీసుకువెళ్లడంతో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి నుంచి జిల్లాలోని బ్యాంకుల కంట్రోలర్లకు కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలంటూ ఆదేశాలు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు కౌలు రైతులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకుల వద్దకు తీసుకు వెళ్లి రుణాలు మంజూరు చేయించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టామని కలెక్టర్ వెల్లడించారు. స్పెషల్ క్యాంపెయిన్ లో భాగంగా ఏపి గ్రామీణ వికాస్ బ్యాంకు 111 మందికి రూ.44.82 లక్షలు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా 8 మందికి రూ.3.1 లక్షలు, ఎస్.బి.ఐ. ద్వారా నలుగురికి రూ.2 లక్షలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ముగ్గురకు రూ.1 లక్ష మంజూరు చేశాయన్నారు. జిల్లాలో ఈ ఏడాది యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా 361 మందికి, ఏపి గ్రామీణ వికాస్ బ్యాంకు ద్వారా 494 మందికి, స్టేట్ బ్యాంకు ద్వారా 318 మందికి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా 91 మందికి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా 54 మందికి, రైతు సేవాసహకార సంఘం, పోలిపల్లి ద్వారా 32 మందికి, కెనరా బ్యాంకు ద్వారా 14 మందికి, ఇండియన్ బ్యాంకు ద్వారా ఐదుగురికి, పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా ఇద్దరికి రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

## ఘనంగా శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున కల్యాణ తీర్థ మహొత్సవం

**ఉర్రుతలూగించిన గుర్రాల పరుగు ప్రదర్శన**

**విశాలాంధ్ర-వేపాడ :** మండలంలోని నల్లబిల్లి గ్రామానికి చెందిన శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి కళ్యాణ తీర్థ మహొత్సవం శనివారం గ్రామ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు ప్రదర్శన చూసిన ప్రజలను ఉర్రుతలూగించాయి. అలాగే రాత్రి 7 గంటల నుండి తీర్థ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ సీతారామ బుర్రకథ బృందం అలరించిన హాస్యం అందర్నీ కడుపుబ్బ నవ్వించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి మురళి సూర్య కుమారి, మాజీ ఎంపీటీసీ రంది ముసలి నాయుడు, గ్రామ పెద్దలు బోజంకి మహేష్, నాగిరెడ్డి చిరంజీవి, రంది మహేష్, బొద్దు సింహాద్రి,తదితరులు పాల్గొన్నారు.

## గంట్యాడలో మండల సమాఖ్య సమావేశం

**విశాలాంధ్ర-గంట్యాడ :** గంట్యాడ మండల సమాఖ్య ఆఫీసులో మండల సమాఖ్య సమావేశము శనివారం నిర్వహించారు ఏపీ సీ ఎన్ ఎఫ్ ఆనందరావు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మండలంలో 9 గ్రామపంచాయతీలో ఈ కార్యక్రమము చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో ఏపిఎం ఎస్ సీసీలు సీసీలు వివో ఏలు పాల్గొన్నారు.

## సిరిమాను వృక్షం సేకరణ

**విశాలాంధ్ర-గంట్యాడ :** గంట్యాడ మండల కేంద్రంలో ఎల్లమాంబ సినిమానోత్సవం కోసం గుర్తించిన గొడివాడ గ్రామంలో చప్ప రామకృష్ణ తోటలో గుర్తించిన సినిమాను వృక్షానికి గురువారం మధ్యాహ్నము ఉత్సవ నిర్వాహకులు గంట్యాడ గొడియాడ గ్రామ పెద్దలు యువత భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్లమాంబ ఆలయ పూజారి కొండబాబు సినిమాను వృక్షానికి పూజలు జరిపి అనంతరము గొడ్డలతో మూడు వేట్లు వేశారు అనంతరము సిరిమాను వృక్షము సేకరణ జరిగింది. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తండ్రి మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు తీర్మానవృక్షాన్ని దర్శించి పూజలు చేశారు.